సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 3 । జనవరి । 2025



సోమశిలలో 71.843 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 71.843 టీఎంసీలు ఉన్నాయి. 3086 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 1550, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 800, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.79,290
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,185
3 శాతం జీఎస్టీతో	రూ.7,401
నవర (8 గ్రా)	రూ.59,208

గరిష్టం/కనిష్టం
29.5 /22.7

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. గురువారం గాలిలో తేమ 71 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ పర్యటన రేపు

నెల్లూరురూరల్/నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి ఏర్పాటు చేసిన వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రా శనివారం నెల్లూరు పర్యటనకు రానున్నట్లు సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వన్‌మాన్ కమిషన్ చైర్మన్ అధికారులతో సమావేశమవుతారన్నారు. అనంతరం విజ్ఞప్తులు స్వీకరిస్తారని, జిల్లాలో ఎస్సీ పౌరులు, సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్లు తమ విజ్ఞప్తులు, అభ్యంతరాలను కమిషన్ చైర్మన్‌కు అందించాలని ఆమె కోరారు.

స్టోన్‌హౌస్‌పేట ఎస్‌ఆర్‌గా సుమలతారెడ్డి బాధ్యతలు

నెల్లూరు సిటీ: నగరంలోని స్టోన్‌హౌస్‌పేట స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్‌గా సుమలతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కావలి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సుమలతారెడ్డి స్టోన్‌హౌస్‌పేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణమూర్తి కావలికి బదిలీ అయ్యారు.

ఇన్‌చార్జి డీఎస్‌ఓగా అంకయ్య

నెల్లూరు (పొగతోట): జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (ఇన్‌చార్జ్)గా అంకయ్యను నియమించారు. అంకయ్య ప్రస్తుతం డీఎస్‌ఓ కార్యాలయంలో ఏఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. డీఎస్‌ఓగా పనిచేస్తున్న వెంకటరమణ గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో డీఎస్‌ఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఏఎస్‌ఓను ఇన్‌చార్జి డీఎస్‌ఓగా నియమించారు.

20లోపు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): స్థానిక కస్తూరిదేవి స్కూల్‌లో ఎస్జీటీ-2, స్కూల్ అసిస్టెంట్ గణితం-2, బయాలజికల్ సైన్స్-1, ఫిజికల్ సైన్స్-1, హిందీ-1 కలిపి మొత్తం 7 పోస్టులకు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్ట్ నియామకం ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

స్తంభించిన రిజిస్ట్రేషన్లు

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాలుగు రోజులుగా సర్వర్లు డౌన్

నెల్లూరు సిటీ: జిల్లాలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ పలు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గత నాలుగు రోజుల నుంచి సర్వర్లు డౌన్ అయ్యాయి. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 30వ తేదీ నుంచి 2వ తేదీ మధ్యాహ్నం వరకు సర్వర్‌లు పనిచేయలేదు. దీంతో రిజిస్ట్రేషన్‌లు, ఈసీలు, ఇతర దరఖాస్తులు నిలిచిపోయాయి. 30వ తేదీన బుచ్చిరెడ్డిపాళెంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా సర్వర్ నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్ల కోసం మూడు రోజుల నుంచి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో గురువారం బుజబుజనెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతంలో విద్యుత్ సమస్య రావడంతో పలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిపై టీడీపీ వర్గీయుల దాడి

- బాధితుడిపైనే కేసు



గాయపడిన పొట్లూరి కోటయ్య

ఉలవపాడు: నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్ జగన్ పాట పెట్టారనే నెపంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిపై టీడీపీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని మర్రిచెట్టు సంఘంలో బుధవారం రాత్రి జరగ్గా గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరేడులోని మర్రిచెట్టు సంఘం గిరిజన కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. నూతన సంవత్సరం వేడుకలు జరుగుతుండగా, అందులో జగన్‌కు సంబంధించిన పాట పెట్టడంతో టీడీపీ కార్యకర్తలు చేవూరి శ్రీనివాసులు, చేవూరి కృష్ణ వెళ్లి అడ్డుకున్నారు. తాము కావాలని పాట పెట్టలేదని, యూట్యూబ్‌లో వస్తున్న పాటల క్రమంలో జగన్ పాట వచ్చిందని ఓ యువకుడు తెలిపాడు. ఇదే సమయంలో ఆ యువకుడి తండ్రి పొట్లూరి కోటయ్య వచ్చి తన కుమారుడిని ఎందుకు ప్రశ్నిస్తున్నారని నిలదీశారు. దీంతో రెచ్చిన పోయిన టీడీపీ నేతలు దాడి చేశారు. దాడిలో గాయపడిన కోటయ్య ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అనంతరం బాధితుడి భార్య వల్లూరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే... ఫిర్యాదు చేసిన బాధితుడిపైనే పోలీసులు కేసు నమోదు చేయడం కొసమెరుపు.

సేద్యానికి నాడు రుణ దన్ను

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు మస్తుగా రుణాలు
- ఖరీఫ్, రబీ సీజన్లలో రుణ లక్ష్యానికి మించి మంజూరు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 100 నుంచి 150 శాతం పెరుగుదల
- రూ.9,202 కోట్ల నుంచి రూ.18,006 కోట్లకు పెరిగిన లక్ష్యం
- టీడీపీ హయాంలో రుణవితరణ లక్ష్యం ఘనం.. ఆచరణ మృగ్యం
- అప్పుడు 65 నుంచి 77 శాతం, ఇప్పుడు 67 శాతానికి మించిన ఫైనం







జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు రుణదన్నుగా నిలిచారు. ప్రతి సంవత్సరం రుణ మంజూరు లక్ష్యానికి మించి రుణాలు అందించారు. కోవిడ్ వంటి మహమ్మారి విజృంభించిన సమయంలో కూడా నూరు శాతం మించి మంజూరు చేశారు. అయితే టీడీపీ ప్రభుత్వంలో పరిస్థితి దిగజారుగా తయారైంది. గత టీడీపీ హయాంలో రైతులకు రుణ వితరణ లక్ష్యాలు ఘనంగా ఉన్నప్పటికీ.. ఏ సంవత్సరం కూడా సంపూర్ణంగా ఇచ్చిన పరిస్థితి లేదు. రుణాల కోసం రైతులు బ్యాంక్‌లకు వెళ్తే.. ఘోరంగా అవమానించిన ఉదంతాలు ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ ఏడాది రుణాల మంజూరు పాతాళానికి పడిపోయింది.

2014 నుంచి పంట రుణాలు

ఏడాది	లక్ష్యం (రూ.కోట్లు)	మంజూరు (రూ.కోట్లు)	శాతం
	టీడీపీ పాలనలో..		
2014-15	2,918.56	1,920.80	65
2015-16	7,799.04	8,376.12	107
2016-17	9,517.20	7,360.57	77
2017-18	11,932.23	9,202.23	77
2018-19	11,252.80	11,453.50	101
	వైఎస్సార్‌సీపీ పాలనలో..		
2019-20	13,110.95	9,880.40	75
2020-21	7,200	7,462.15	103
2021-22	10,634.66	10,992.46	103
2022-23	9,882.87	15,148.44	153
2023-24	15,823.87	18,105.37	114
	టీడీపీ పాలనలో..		
2024-25	18,006.2	12,120.7	67

టీడీపీ పాలనలో అప్పుడు..ఇప్పుడూ దగా



టీడీపీ అధికారంలోకి రావడంతో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రుణ వితరణలో బ్యాంకర్ల ప్రాధాన్యత మారింది. రుణాల మంజూరులో బ్యాంకర్లు వెనకడుగు వేసినట్లు స్పష్టమవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మస్తుగా రుణాలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ ఏడాదిలో జిల్లాలోని 392 బ్యాంకు శాఖల ద్వారా రూ.18006.2 కోట్ల రుణాల మంజూరు లక్ష్యాన్ని నిర్ణయించింది. ఇందులో పంటలు సాగు చేసే రైతులకు రూ.8,929.02 కోట్లు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు రూ.9,077.18 కోట్లు అందించాలని నిర్ణయించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఉదారంగా రుణ వితరణకు బ్యాంకర్లు విముఖత చూపిస్తున్నారని.. ఇప్పటి వరకు జరిగిన రుణాల మంజూరు గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయానికి అందించే రూ.8,929.02 కోట్లల్లో ఖరీఫ్ సీజన్‌లో రూ.3,839.47 కోట్లు, రబీలో రూ. 5,089.55 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యం. అయితే ఈ రెండు సీజన్లకు సంబంధించి డిసెంబరు ఆఖరు వరకు కేవలం రూ.5666.59 కోట్లు మంజూరు చేశారు. ఇక అనుబంధ రంగాలకు సంబంధించి ఈ ఏడాదిలో రూ.9,077.18 కోట్ల రుణ వితరణ లక్ష్యం కాగా, దీర్ఘకాలిక రుణాలుగా రూ.3,114.43, ఎంఎస్ఎంఈ రుణాలు రూ.3,339.68 కోట్లు మొత్తం రూ.6,454.11 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాదిలో మొత్తం రూ.18006.2 రుణ లక్ష్యంలో ఇప్పటి వరకు రూ.12,120.7 కోట్ల రుణాలే మంజూరు చేయడం విశేషం. రుణ లక్ష్యంలో 67 శాతమే రుణవితరణ జరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

కావలి: వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిస్తే.. టీడీపీ ప్రభుత్వం గతంలోనూ, ప్రస్తుతం నడ్డి విరుస్తోంది. అధికారంలో ఉండే ప్రభుత్వాలను బట్టే బ్యాంకర్లు సైతం వ్యవహరిస్తున్నారనేది గత పదేళ్లలో వ్యవసాయ రంగానికి రైతులకు ఇచ్చే రుణ వితరణ లక్ష్యాలు.. మంజూరు గణాంకాలు అద్దం పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాగుంటే.. దేశం బాగుంటుందని భావించి ఆ రంగానికి ఎనలేని అండగా నిలిచారు. సేద్యానికి పెట్టుబడి సాయంగా వైఎస్సార్ రైతు భరోసా ఇచ్చారు. పండించిన పంటలకు ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకున్నారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే.. ఆ సీజన్ ముగిసే నాటికి పరిహారం అందించారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించడంతో బ్యాంకర్లు కూడా వ్యవసాయ రుణాల మంజూరులో ఉదారంగా వ్యవహరించారు.

టీడీపీ గత, ప్రస్తుత పాలనలో అధఃపాతాళం

టీడీపీ అధికారంలో ఉన్న 2014- 2019 వరకు ఐదేళ్లలో మూడేళ్లు 65 నుంచి 77 శాతానికి మించి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయని పరిస్థితి ఉండింది. దీనికి ప్రధాన కారణంగా అప్పట్లో అధికారంలోకి టీడీపీ విధివిధానాలే అని బ్యాంకర్లు స్పష్టం చేశారు. టీడీపీ గతంలో అధికారంలోకి రావడానికి ముందు వ్యవసాయ రుణాలను సంపూర్ణంగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం దక్కాక.. రుణమాఫీపై మెలికలు పెట్టింది. మాఫీ ఎగనామం పెట్టడానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలు అమలు చేయకుండా రుణాలు మంజూరు చేశారంటూ బ్యాంకర్లపై ఎదురు దాడి చేసింది. బ్యాంకర్లపై ఆర్‌బీఐకు ఎందుకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోకూడదంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కొర్రీలు పెట్టే పరిస్థితికి రావడంతో ఈ దుస్థితి దాపురించిందని బ్యాంకర్లు అప్పట్లో చెప్పుకొచ్చారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో లక్ష్యం ఘనం

వ్యవసాయ రంగానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి సహకారం ఇస్తున్న క్రమంలో రైతులకు రుణాలు మంజూరు చేసే విషయంలో భారీ లక్ష్యాలను నిర్దేశించడం ప్రారంభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి జిల్లాలో వ్యవసాయ రంగానికి రూ.9,202 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం ఉండగా, గడిచిన ఐదేళ్లలో కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులను అధిగమించి రూ.18,006 కోట్లకు తీసుకెళ్లారు. ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో చివరి నాలుగేళ్లు 100-153 శాతానికి రుణ వితరణ పెరిగింది. తొలి సంవత్సరంలో 75 శాతానికి మించలేదు. గతంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ ప్రభావం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

రుణాల మంజూరు లక్ష్యాలను చేరకపోతే చర్యలు



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు మంజూరు చేయాలి. లక్ష్యాలను చేరుకోని బ్యాంకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ శాఖ సీసీఆర్‌సీ కార్డ్ హోల్డర్ల జాబితాను సిద్ధం చేసి, కౌలు రైతులతో నేరుగా సంబంధిత బ్యాంకులకు అనుసంధానం చేయాలి. బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇచ్చే వరకు సరైన పర్యవేక్షణ తీసుకోవాలి. కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు కూడా చురుకుగా వ్యవహరించాలి. కారణం లేకుండా రుణాలు తిరస్కరణ చేసిన బ్యాంకులపై చర్యలు ఉంటాయి. క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద క్లస్టర్లలో గుర్తించిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి.

– ఆనంద్, కలెక్టర్, నెల్లూరు

ఇసుక దోపిడీ.. ఆపే దమ్ముందా?

- వైఎస్సార్‌సీపీ హయాంలో మినగల్లులో 25 వేలు, సంగంలో 15 వేల టన్నుల నిల్వ
- అధికారంలోకి రాగానే వాటిని ఖాళీ చేసిన టీడీపీ తమ్ముళ్లు
- దామరమడుగు వద్ద అక్రమంగా డంపింగ్
- ఆరు నెలల్లో లక్షల టన్నుల అక్రమ రవాణా
- అజ్ఞాత వ్యక్తుల ఫిర్యాదుతో గనుల శాఖ దాడుల్లో పట్టుబడిన అక్రమ నిల్వలు

జిల్లాలో ఏడు నెలలుగా ఇసుక దోపిడీ విచ్చలవిడిగా జరుగుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. స్థానిక ప్రజాప్రతినిధి అండతో లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తరలించి రూ.కోట్లు దోచుకున్నారు. ఆపే దమ్ము అధికారులకు లేకుండా పోయింది. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని పెన్నా పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. ఈ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారడంతో ప్రస్తుతం మౌనం దాల్చినట్లు తెలుస్తోంది.



గత ప్రభుత్వం నిల్వ చేసిన ఇసుకను అక్రమంగా తరలించిన దృశ్యం (ఫైల్)



దామరమడుగు డంపింగ్ యార్డులో మైనింగ్ డీడీ, బుచ్చిరెడ్డిపాళెం సీఐ తనిఖీలు

బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ నేతలు ఇసుకను ప్రధాన ఆదాయవనరుగా మార్చుకున్నారు. ఇసుకాసురులుగా మారారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు మినగల్లు డంపింగ్ యార్డులో 25 వేల టన్నులు, సంగం యార్డులో 15 వేల టన్నులు నిల్వ చేసింది. నెల్లూరులోని ఓ వైద్యశాల అధిపతి స్థానిక ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఓ వ్యక్తి టీడీపీ అధికారంలోకి రాగానే ఆ ఇసుక మొత్తం పక్క రాష్ట్రాలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. అయినా ఏ ఒక్క అధికారి అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఆరు నెలల్లో లక్షల టన్నుల్లో దోపిడీ

టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆరు నెలలుగా పెన్నాతీరంలోని మినగల్లు, బాపనపాడు, దామరమడుగుల్లోని అనధికార ఇసుక రీచ్‌ల్లో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. స్థానికుల అంచనాల ప్రకారం లక్షల టన్నుల ఇసుకను రీచ్‌ల నుంచి తరలించి దామరమడుగు వద్ద నిల్వ చేసి తరలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దామరమడుగు వద్ద డంపింగ్ యార్డులో 5,600 టన్నుల ఇసుక అక్రమ నిల్వలు ఉన్నట్లు ఇటీవల అజ్ఞాత వ్యక్తులు భూగర్భ గనుల శాఖ డీడీ బాలాజీనాయక్ సమాచారం అందించారు. దీంతో ఆయన తన సిబ్బంది తనిఖీల్లో ఇసుక అక్రమ నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో బుచ్చిరెడ్డిపాళెం మండలం అడ్డాగా ఇసుక అక్రమ రవాణా సాగుతుందన్న ఆరోపణలకు బలం చేకూర్చింది. భూగర్భ గనుల శాఖాధికారులు ఇచ్చిన సమాచారంతో బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు డంపింగ్ యార్డు వద్దకు వచ్చి ఓ డోజర్, జేసీబీలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాత్రి సమయాల్లో డంపింగ్ యార్డు నుంచి ఇతర ప్రాంతాలకు భారీ ధరలకు ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం అందడంతోనే ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలపడం విశేషం.

పోలీసుల నిఘాలో డొల్లతనం

మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా లేదంటూ ఇన్నాళ్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. తాజాగా ఈ ఘటనతో పోలీసుల నిఘా డొల్లతనాన్ని బయటపెట్టింది. నియోజకవర్గంలో అవినీతికి తావులేదని అక్రమార్కులను ప్రోత్సహించనని ఓ పక్కన ఎమ్మెల్యే ప్రకటిస్తున్నప్పటికి అక్రమార్కులు మాత్రం యథేచ్ఛగా ఇసుక తరలిస్తుండడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రెండేళ్లలో పెన్నానదిలో ఇసుక నిల్వలు కొరవడి భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఏర్పడుతుందని పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీపీడబ్ల్యూ స్కీమ్‌లు సక్రమంగా నిర్వర్తించాలి

- జెడ్పీ సీఈఓ విద్యారమ



కండలేరు స్కీమ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

పొదలకూరు : సీపీడబ్ల్యూ స్కీమ్‌లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ విద్యారమ ఆదేశించారు. పొదలకూరు మండలంలో 12 గ్రామాలకు తాగునీటిని అందించే కండలేరు సీపీడబ్ల్యూ స్కీమ్‌ను గురువారం సీఈఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వారానికి రెండు సీపీడబ్ల్యూ స్కీమ్స్‌ను పరిశీలించాల్సిందిగా పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశించినట్లు చెప్పారు. ముందుగా పొదలకూరుకు తాగునీటిని సరఫరా చేసే స్కీమ్‌ను తనిఖీ చేశామన్నారు. పొదలకూరు స్కీమ్ పనితీరు, స్కీమ్ నిర్వహణ కాంట్రాక్టర్ వివరాలు సీఈఓ అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో కూడా సక్రమంగా స్కీమ్ నుంచి తాగునీటిని అందజేయాల్సిందిగా సూచించారు. ఒక్క రోజు కూడా సీపీడబ్ల్యూ స్కీమ్ వల్ల ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ ఉండాల్సిందిగా సూచించారు. సీఈఓ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య, డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ డీవీ నరసింహారావు, ఏఈలు కసనానాయక్, రమేష్, దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

పెద్దాస్పత్రిలో ఆర్‌ఐసీయూ ప్రారంభం



ఆర్‌ఐసీయులోని రోగులతో మాట్లాడుతున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): ఆధునిక సౌకర్యాలతో వెంటిలేటర్, ఇతర క్రిటికల్ కేర్ పరికరాలతో ఏర్పాటు చేసిన రెస్పిరేటరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను (ఆర్‌ఐసీయూ) తొలిసారిగా పెద్దాస్పత్రిలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఇతర ప్రైవేట్ ఆస్పత్రుల్లో తీవ్ర అనారోగ్యానికి గురై సీరియస్ అయిన కేసులు టెర్షరీ ఆస్పత్రిగా ఉన్న పెద్దాస్పత్రికి నిత్యం వస్తున్నాయన్నారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా మత్తు డాక్టర్ల పర్యవేక్షణలో ఈ ఆర్‌ఐసీయూ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఖరీదైన ఈ వైద్యాన్ని రోగులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పెద్దాస్పత్రిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డాక్టర్ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చేనేతల కల సాకారం

పాటూరులో మినీ క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

కోవూరు: జిల్లాలో చేనేతకు ప్రసిద్ధిగాంచిన పాటూరు చేనేతలకు తీపి కబురు అందింది. కోవూరు నియోజకవర్గంలోని పాటూరు గుమళ్ల దిబ్బలో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందు కోసం రూ. 76.32 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాటూరులోని గుమ్మలదిబ్బలో ఉన్న 175 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. తొలి విడతలో రూ.28 లక్షలు మంజూరు చేసింది. కోవూరు నియోజకవర్గంలో ఉన్న పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నవంబర్ 26న కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు విన్నవించారు. పాటూరులో అనేక కుటుంబాలు పూర్తిగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, ఇక్కడ క్లస్టర్ ఏర్పాటు ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ కమిషనర్ జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద ఐదు కొత్త స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను చేనేత అభివృద్ధి కమిషనర్‌కు సమర్పించారు. అందులో పాటూరు కూడా ఒకటి ఉంది. పాటూరులో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌సీడీపీ) ప్రతిపాదనలు అంగీకరించి నిధుల మంజూరుకు సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి మేరకు పాటూరు- గుమ్మళ్లదిబ్బ మినీ క్లస్టర్ ఏర్పాటును నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. దాంతో పాటూరు- గుమ్మళ్లదిబ్బ గ్రామాలకు చెందిన చేనేత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నామన్నారు.

క్లస్టర్ ఏర్పాటుతో జరిగే మేలు..

క్లస్టర్ ఏర్పాటుతో స్థానికంగా ఉండే చేనేతలకు ఎంతో మేలు జరగనుంది. చేనేతలకు మగ్గం సామగ్రి అందించడంతో పాటు వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. మగ్గం వర్క్‌లో అధునాతన విధానాలు సమకూరుస్తారు. మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న డిజైన్లపై తగిన శిక్షణ అందించి వారికి నేర్పిస్తారు. ఎవరైనా చేనేత వ్యక్తిగతంగా సొంత స్థలం ఉండి రూమ్ ఏర్పాటు చేయాలని భావిస్తే అందుకు తగిన నిధులు సమకూరుస్తారు. వారి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి విలువ ఉండేలా కృషి చేస్తారు. చేనేతలను అన్ని విధాలా ఆదుకునేందుకు, వారికి అండగా తగిన ప్రోత్సాహం అందిస్తారు.

క్లుప్తంగా

పాల వ్యాన్ ఢీకొని..

- వ్యక్తి మృతి



వేణు మృతదేహం

వలేటివారిపాళెం: పాల వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని పోకూరు ఆక్స్‌ఫర్డ్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రొళ్లపాడు గ్రామానికి చెందిన చొప్పర వేణు (40) వ్యక్తిగత పనులపై తన మోటార్‌బైక్‌పై కందుకూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. పోకూరు గ్రామం వద్ద ఉన్న ఆక్స్‌ఫర్డ్ పాఠశాల సమీపానికి రాగానే వలేటివారిపాళెంలో పాల క్యాన్లు తీసుకుని సింగరాయకొండ వెళ్తున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వేణు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పాల వ్యాన్‌ను అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై మరిడి నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఐదుగురికి గాయాలు

కావలి: గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో ఐదుగురు వ్యక్తులు గాయపడినట్లు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కావలిలో నివాసముంటున్న గౌడుపేరు కాంతారావు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అతడి అన్న గౌడపేరు కాలయ్య కూడా పట్టణంలో నివాసం ఉంటున్నాడు. కాగా వారి తల్లిదండ్రులు గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఉన్నారు. వారికి అనారోగ్యంగా ఉండటంతో కాంతారావు, అరుణ దంపతులు, కాలయ్య, రాములమ్మ దంపతులతోపాటు కుమారుడు శ్యాంసన్‌లు రెండు మోటార్‌బైక్‌లపై చేవూరుకు వెళ్లి పరామర్శించి బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కావలికి తిరుగు ప్రయాణమయ్యారు. చెన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిపై కావలికి వస్తుండగా రూరల్ మండలం రుద్రకోట గ్రామం వద్ద ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుర్తుతెలియని కారు రెండు బైక్‌లను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వారు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నారు. కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్యల గుంతలో పడి వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రొయ్యల గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గంగపట్నం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కృష్ణారావు (51) తన భార్యతో కలిసి ఓ రైతుకు చెందిన రొయ్యల గుంత వద్ద కాపలాగా ఉన్నాడు. రొయ్యలకు మేత వేసే క్రమంలో అతను ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.

తాటిపర్తిలో అదుపులోకి రాని జ్వరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో వైరల్ జ్వరాలతో జనం మంచం పడుతున్నారు. వారం రోజులుగా జ్వరపీడితులు ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. వాతావరణ మార్పులతోపాటు చలితీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వైరల్ ఫీవర్స్ గ్రామంలో పెరుగుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉన్న మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యులు సర్వే నిర్వహించి రక్త నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేస్తున్నా జ్వరాలు ఇంకా అదుపులోకి రావడం లేదని గ్రామస్తులు వెల్లడించారు. గురువారం కూడా వైద్యాధికారి నరసింహారావు పర్యవేక్షణలో ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు. గ్రామంలో మిట్ట మీద ప్రాంతంలో జ్వరాలు విజృంభించాయని, వాటిని అదుపు చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. మురుగు కాలువల్లో దోమలు ఉధృతి పెరగకుండా అదుపు చేసేందుకు అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేసి లార్వాను నాశనం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృత్యువాత

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు – ముంబై హైవేపై బుధవారం రాత్రి మినీ లారీ, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నంద్యాలకు చెందిన మినీ లారీ డ్రైవర్ దస్తగిరి మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా తీవ్రంగా గాయపడి నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ రమణారెడ్డి (60) గురువారం చనిపోయాడు. సంగం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడిని నెల్లూరు వాసిగా గుర్తించారు.



నిమ్మ ధర.. వ్యాపారుల ఇష్టారాజ్యం

- ఎగుమతులు పెరిగినా దక్కని లాభాలు
- సాగుకు అనుగుణంగా సహకరించని మార్కెట్
- రేటు కట్టడంలో దోబూచులాట

▸▸ గిట్టుబాటు కల్పించాలంటున్న రైతులు

నిలకడ లేని నిమ్మ ధరలు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కాయల కోత సమయంలో చక్కటి రేటు పలుకుతున్నాయి. మార్కెట్‌కు చేరగానే ఒక్కసారిగా పతనమవుతున్నాయి. అన్నదాతకు పెట్టుబడి కూడా గిట్టుబాటు కాని దుస్థితిని కల్పిస్తున్నాయి. అయితే వ్యాపారులు మాత్రం వివిధ ప్రాంతాలకు నిమ్మను ఎగుమతి చేసి రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ధరలను శాసిస్తూ.. కర్షకుడి శ్రమను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో తమ అంతస్తులు పెంచుకుంటున్నారు.



నిమ్మ తోటలు

సైదాపురం: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, గూడూరు, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాల్లో నిమ్మ సాగు అధికంగా ఉంది. మిగిలిన మండలాల్లో అక్కడక్కడా ఉంది. మొత్తంగా సుమారు 30 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తుంటారు. ఈ ఏడాది అదనంగా మరో రెండు వేల ఎకరాల్లో తోటల పెంపకం చేపట్టారు. ఈ ప్రాంతాల్లో దాదాపు 70 శాతం మంది రైతులు దీనిపైనే ఆధారపడ్డారు. మద్దతు ధర విషయంలో ఇబ్బందులు పడుతున్నా, నిమ్మను మాత్రం వదలని పరిస్థితి. పసిబిడ్డలను పెంచినట్టు మూడేళ్లపాటు మొక్కల సంరక్షణ చేపడుతుంటారు. నాలుగో ఏడాది నుంచి నిమ్మ కాయలు కోత మొదలుపెడుతుంటారు. పొదలకూరు, గూడూరులో యార్డులున్నాయి.

గాలివాటంగా మార్కెట్

రూ.లక్షల పెట్టుబడితో నిమ్మ తోటలు సాగు చేస్తే, ధరలు మాత్రం రైతులను ఎప్పటికప్పుడు మోసం చేస్తూనే ఉన్నాయి. దిగుబడి బాగా వచ్చినప్పుడు ధర ఉండదు. అరకొర కాయలు వస్తే రేటు ఆకాశాన్నంటుతోంది. నిమ్మకాయ లోడ్‌లు అధికంగా వస్తే రైతులకు రేటు తగ్గించి చెల్లిస్తుంటారు. తక్కువగా వస్తే కాస్త గిట్టుబాటు ధర ఇస్తుంటారు. వ్యాపారులు మాత్రం దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఎగుమతులు చేసి అధిక లాభాలను కళ్లజూస్తునానరు. ఈ క్రమంలో గాలివాటంగా మార్కెట్ మారిపోవడంతో రైతులు చేసేదిలేక ఇచ్చింది తీసుకుని వెళ్లిపోతున్నారు.



చెట్లకు మందు పిచికారీ చేస్తున్న మహిళా కూలీ



నిమ్మ కాయలు కోస్తున్న మహిళలు



నిమ్మ కాయల్ని గ్రేడింగ్ చేస్తూ..

ప్రోత్సాహకాలు అందించాలి



ఒకప్పుడు నిమ్మ రైతులకు మందులు, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించేవారు. కొన్నేళ్లుగా ఉద్యాన శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే మార్కెట్ కమిటీలను పర్యవేక్షించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాలి. లేకుంటే మా కష్టం మాకు దక్కదు.

– వెంకటసుబ్బరాజు, నిమ్మ రైతు, లింగనపాళెం, సైదాపురం మండలం

సాగు విస్తీర్ణం పెరుగుతోంది

గతంలో ఎన్నడూలేని విధంగా నిమ్మ తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. రైతులకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. ఈ క్రమంలోనే మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించేందుకు సహకరిస్తున్నాం. సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఆనంద్, ఉద్యాన శాఖాధికారి, పొదలకూరు

328 మంది అభ్యర్థుల హాజరు



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పోలీస్ కవాతు మైదానంలో నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో మూడోరోజైన గురువారం కొనసాగింది. తెల్లవారుజామున ఐదు గంటలకే అభ్యర్థులు మైదానానికి చేరుకున్నారు. వారి ఎత్తు, ఛాతి కొలతలు నమోదు చేశారు. అందులో అర్హత సాధించిన అభ్యర్థులకు 1,600 మీటర్ల పరుగు నిర్వహించారు. నిర్దిష్ట సమయంలో పరుగు పూర్తి చేసిన వారికి 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు పెట్టారు. రాణించిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి పరీక్షల్లో ఉత్తీర్ణులైనట్లు ధ్రువీకరణపత్రాలు ఇచ్చారు. గురువారం 600 మందికి గానూ 328 మంది పరీక్షకు హాజరుకాగా 272 మంది గైర్హాజరయ్యారు.

నేడు మహిళా అభ్యర్థులకు..

కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా శుక్ర, శనివారాల్లో 835 మంది మహిళా అభ్యర్థులకు పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రోజుకు 400 మందికిపైగా పరీక్షలు నిర్వహించనున్నారు.

మృగంలా మారి.. లైంగికదాడికి పాల్పడి..

కావలి: పట్టణంలోని గాయత్రి నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి మహిళ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. పోలీసుల రంగప్రవేశంతో నీచుడి వ్యవహారమంతా బయటపడి స్థానికుల్లో కలకలం రేగింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులకు అనే విషయాలు తెలుస్తున్నాయి. వరుసకు అన్న భార్య అర్పితా బిస్వాస్‌ను మరిది నయ బిస్వాస్ దారుణంగా హత్య చేసి లైంగికదాడి చేసిన ఘటనలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. చంటి బిడ్డకు పాలిచ్చి ఆదమరిచి నిద్రిస్తున్న వదినను అనుభవించాలని నయ బిస్వాస్ రాక్షసుడిగా మారాడు. ఆమెను ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. మృతదేహంపై దుస్తులు తొలగించి శారీరకంగా అనుభవించాడు. ఆ తర్వాత మృతదేహాన్ని వంద మీటర్ల దూరంలో ఉన్న పంటకాలువ వద్దకు ఈడ్చుకెళ్లి అక్కడ మరోసారి తన కోరిక తీర్చుకున్నాడు. మృతదేహాన్ని కాలువలో పడేశాడు. ఇంటికొచ్చిన తర్వాత మృతురాలి దుస్తులు, హత్యకు వినియోగించిన రాడ్‌ను ఇంట్లో నుంచి బయటకు విసిరేసి రక్తపు మరకలు తుడిచేశాడు. తన దుస్తులను కూడా మార్చుకుని దర్జాగా బయటకు వెళ్లాడు.



పోలీసుల అదుపులో నిందితుడు నయ బిస్వాస్

సంగం బ్యారేజ్‌లో వృద్ధురాలి మృతదేహం



సంగం: దగదర్తి మండలం దుండిగం గ్రామానికి చెందిన ఎం.పెంచలమ్మ అనే వృద్ధురాలి మృతదేహాన్ని గురువారం స్థానికులు సంగం బ్యారేజ్‌లో గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై జాకీర్‌బాషా బ్యారేజ్‌లోని మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ప్రమాదవశాత్తు జారి పడిందా? అనే కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరులో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నేడు



సభా వేదిక వద్ద అధికారులు

- ఆర్ఎస్ఆర్ స్కూల్లో ఏర్పాట్లు
- 114 నమూనాల ప్రదర్శన
- ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ
- హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

నెల్లూరు(టౌన్): జిల్లా స్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఈ ప్రదర్శన జరుగుతుంది. ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు గురువారం పరిశీలించారు. వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాల్లో 114 నమూనాలను ప్రదర్శించనున్నారు. ఒక్కో విభాగంలో 38 నమూనాలుంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం నారాయణరెడ్డి, ఇంకా జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రత్యేక అతిథులుగా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ కె.కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బారావులు విచ్చేస్తారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



ఏర్పాట్లను ఆరా తీస్తున్న డీఈఓ బాలాజీరావు

ఉదయం రిజిస్ట్రేషన్

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరయ్యే విద్యార్థులు ఆర్ఎస్ఆర్ స్కూల్లో ఉదయం 8 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ప్రదర్శనను ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు డిప్యూటీ డీఈఓ జానకిరామ్, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరి రామ్‌కుమార్, ఎంఈఓలతో కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంకా జ్యూరీ, టెక్నికల్, డాక్యుమెంటేషన్, రిజిస్ట్రేషన్, డిస్‌ప్లే, ఫుడ్ తదితర కమిటీలను నియమించారు. సభ్యులు విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయనున్నారు. ఇక్కడ ఎంపికైన ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపనున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.28
సన్నవి : రూ.23
పండ్లు : రూ.12



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 113
లేయర్ (లైవ్) : 90
బ్రాయిలర్ చికెన్ : 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 226
లేయర్ చికెన్ : 153



180కి పైగా కేసులు, 18 ఏళ్ల జైలుశిక్ష

- గంజాయి కేసులో పట్టుబడిన వ్యక్తి చరిత్ర ఇది
- నిందితుడి నేర జీవితంతో నివ్వెరపోయిన పోలీసులు
- ప్రస్తుతం కావలి సబ్‌జైల్లో..



గంజాయి పొట్లాలు (ఫైల్)

కావలి: గంజాయి కేసులో పట్టుబడిన ఒక వ్యక్తిని కావలి పోలీసులు విచారించారు. అతని నేర జీవితాన్ని తెలుసుకుని నివ్వెరపోయారు. 180కి పైగా దొంగతనాల కేసులున్నాయి. వాటికి సంబంధించి 18 సంవత్సరాలపాటు అతను జైలు జీవితం గడిపాడు. ప్రస్తుతం గంజాయి కేసులో కావలి సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

దొంగతనాలు చేసి..

కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో స్థిరపడిన ఓ కుటుంబానికి చెందిన వేలు 25 సంవత్సరాల వయసు ఉన్నప్పటి నుంచి దొంగతనాల బాట పట్టాడు. పగలు రెక్కీ చేసేవాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను బాగా గమనించేవాడు. చుట్టుపక్కల ఉన్న నివాసాలను, వ్యక్తుల కదలికలను స్వల్ప సమయంలోనే అవగాహన చేసుకుని రాత్రి వెళ్లి దొంగతనం చేసేవాడు. అలా 25 సంవత్సరాలపాటు నేరాలు చేశాడు. వీటికి సంబంధించి 180కి పైగా పోలీసు కేసులను ఎదుర్కొన్నాడు. వాటి తాలూకా జైలు జీవితం అనుభవించాడు. అయితే అతడిలో ఎలాంటి మార్పు రాలేదు.

ఆటోలో తిరుగుతూ..

వేలుది స్థిర నివాసం బెంగళూరు. వయసు మీద పడటం.. శరీరంలో చురుకుదనం సన్నగిల్లడంతో నేర స్వభావాన్ని మార్చాడు. గంజాయి అమ్మకాలపై దృష్టి పెట్టాడు. ఇందులో భాగంగా ఆటో నడపడం మొదలుపెట్టాడు. అందులో తిరుగుతూ బెంగళూరులోని బస్టాండ్లు, ఇతర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు చేసి సంపాదించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతం నుంచి చౌకగా గంజాయిని కొనుగోలు చేసి బెంగళూరుకు చేర్చి పొట్లాలు కట్టి అమ్మకాలు చేస్తే మరింత ఆదాయం వస్తుందని భావించాడు. అందులో భాగంగా విశాఖపట్నం ప్రాంతంలో గంజాయి అమ్మకాలు చేసే రాజు అనే వ్యక్తి గురించి తెలుసుకుని డీల్ మాట్లాడుకున్నాడు. రెండుసార్లు విశాఖపట్నం వెళ్లి అతడిని కలిసి గంజాయిని పార్సిల్ చేయించుకుని బెంగళూరుకు తీసుకెళ్లి అమ్మి సొమ్ము చేసుకున్నాడు.

దొరికిపోయి..

మూడో ప్రయత్నంలో వేలు దొరికిపోయాడు. గత సంవత్సరం డిసెంబర్ 20వ తేదీ విశాఖపట్నం ప్రాంతంలో రాజు వద్ద 10.045 కేజీల గంజాయిని కొనుగోలు చేసి, వాటిని ఆరు ప్యాకెట్లలో పార్సిల్ చేసి ట్రావెల్ బ్యాగ్‌లో పెట్టుకుని లారీలో బెంగళూరుకు ప్రయాణమయ్యాడు. దారిలో కావలి మండలం గౌరవరం వద్ద జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా సమీపంలో బ్యాగ్‌తో దిగి, మరో లారీ ఎక్కడానికి ప్రయత్నించాడు. అప్పటికే ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ సూచనలతో కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్సైలు సీహెచ్ తిరుమలరెడ్డి, ఎం.బాజీబాబు, సిబ్బంది ఆర్.రాధయ్య, కె.ప్రసాద్‌లు టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాల్లో నిఘా పెట్టారు. గంజాయి రవాణా గురించి సమాచారం అందడంతో రహస్య ఆపరేషన్ చేపట్టారు. ఈ నేపథ్యంలో వేలు పోలీసులను చూసి కంగారు పడుతూ పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతడిని పట్టుకున్నారు. విచారించగా గంజాయి రవాణా, అమ్మకాలు, ఇంకా తన నేర జీవితాన్ని వెల్లడించాడు.